**కథానిక**

# తీర్మానం

## పి. మాధవరావు

వెన్నెట్లో మంచం వాల్చుకుని కూచున్నాను. రాములు దగ్గరగా వచ్చి, ఐదేళ్ళ తర్వాత నేనీ వూరికి వొచ్చినందుకు ఆప్యాయంగా మాట్లాడసాగాడు. విషయాలు ఏఁవిటని అడగ్గా, అంతకు ముందు ఎన్నో జరిగినా ఈ రోజు జరిగిందంటూ చెప్పసాగాడు.

"పొద్దుట్నుంచి మాదిగాడ కట్ల లొల్లిలొల్లి గున్నది. ఆడోళ్ళు మొగోళ్ళు అఁత నోర్లు మూసోక్కుండ ఎవర్నో తిడ్తుండరు. మాదిగె పెంటిగాని బిడ్డ సూరిని నాత్తిరి రాజిరెడ్డి గుంజిండంట. అదేమొ ఒకటే ఏడుస్తున్నది ఎవర్కి జెప్పలేదు. గది రాజిరెడ్డి నడిగిండు మాదిగోళ్ళంతా గల్సి "నా కాడికొస్తె చెప్పుదీస్కదంత ఏవన్కున్నరు. మీ పిల్ల సక్కనయిందా, రేటు దక్వయిందని మొత్కుంటున్నదేమె నంజ ... రిపోర్టిస్త ఏవనుకున్నరో అఁ... ఈ బేరం మొదలైందా మనూళ్లె ఎన్నళ్లైంది" అంట ఏమో శానా శానా తిట్టిండు రాజిరెడ్డి. గదంతా ఇని సప్పుడుగా కొచ్చింరు మాదిగోళ్ళు.

నెత్తి నెండ గొడ్తున్నది బాగ. నెత్తిగాల్నట్టే మాదిగోళ్ళ కడుపుల్ల ఆకలి గాల్తున్నది. ఆకలిమంటకంటె వాళ్ళ గుండెమంట లెక్కయి వాళ్ళ కొకళ్ల దెలుస్తలేవు. అఁదర్ పోలీసు పటేల్ వాకిట్ల జేరిఁరు. మాదిగోళ్ళు పటేల్కు దఁడం బెట్టింరు. సూరి దూరంగ ముక్కుజీదుకుంటనువడ్డది.

"ఎండ పెంటిగా ఏం సంగతి" అంటడ్గిండు పటేలు మల్లిరెడ్డి.

"గులాపోన్ని పటేలా మీరు పెద్దోళ్లు. ఏంజేఁశినా జెల్తది. మేం నోట్ల తళ్ళె నోళ్ళం. సంపినా మీరె సాకినా మీరె అంట పెరిగినం మీ కాళ్ళకాడ బాంచెన్ ...." అంట సగం జెప్పి ఆగిండు పెంటిగాడు. గది ఇని.

"ఏంద పూరగ ఇసయం జెప్పు - నీకేం బయంలే" అన్నడు మల్లిరెడ్డి. మల్లిరెడ్డి ఈళ్ళతోని మాట్లాడుతున్నా సూరికేశి జూసి గుట్కలు మింగుతున్నాడు. గదిని జెర దైర్నమొచ్చింది పెంటిగానికి.

"ఏం జెప్పాలె బాంచెన్ మాపోరి వొయిసులున్నది. నాతాన పైసలేక

అగ్గంజెయలే...రెక్కాడ్తెనెకాని డొక్కాడ్తది మాకు. నాత్తిరి అది కట్టెలకు పోయిందట... బాంచెన్ ... శాన కట్టెల్గొట్టి అల్సి జెర జాల్నైక పోదామని గుట్టలకాడ కూకున్నదంట. ఇట్లనే మూడ్డినాల్నుండి రాజిరెడ్డి పటేల్ జూస్తున్నదంట... నాత్తిరి... నీకాల్మొక్త .... బాంచెన్ జెరసాటుకు రమ్మన్నడంట అది పోలేదంట...అయితె నీ బాంచెన్ ఏంజెప్పాలె... నోరాస్త లేదు. కన్న తండ్రిని గద పటేలా...ఇకరాజిరెడ్డిఊరొక్కలేదంట" అంటజెప్పి చిన్నపోరనోతు ఏడుస్తున్నాడు పెంటిగాడు. గదంత ఇని మల్లరెడ్డి "ఏం పోరి ఇదంతనువద్ద నేనా" అంటడ్గిండు ఓరగజూస్త. సూరి తల్కాయెత్తి సూసి పటేల్ సూపులకు మల్ల కింది మొకాన ఒంగి "నువద్దనె పటేలా బాంచెన్ ... అవద్దమెందుకు జెప్తం గులాబుదాన్ని" అంటుంది. మల్లరెడ్డి శిన్నగ నగిండు. నగి అటే వొస్తన్న రాజిరెడ్డి దిక్కు జూశినగిండు.

"ఏంజేంతాంర పెంటిగాఅయితే... నువ్వెజెప్పు రాజిరెడ్డి మీద రిపోరటియ్యగా పటేల్ను పోలీసోళ్లు పట్కపోవాల్నా" అంటడిగిండు.

"నీ బాంచెన్ నేనేంజెప్త పటేలా... ఇసయంగది.... ఇగ తీర్మానం నువ్ జెప్పు" అంటన్నడు పెంటిగాడు.

రాజిరెడ్డి మల్లరెడ్డి మొకాల్జూసుకున్నరు అళ్ళిద్దరు బావమర్దులు గావలె.

ఏం రాజిరెడ్డి బావ ఇదంతనువద్దినేనే...ఊళ్ళు జెప్తున్నది" అంటన్నడు మల్లరెడ్డి.

"ఏంబావో నువ్‌గూడ వదుగుర్ల వరువుదీస్తవు. గాడ్దెస్తె ఎట్ల నమ్మతవ్" అంటన్నడు రాజిరెడ్డి.

"మళ్ళిందాక సప్పుడ్జేయక పోతివేంది" అంటన్నడు మల్లరెడ్డి.

"ఏం జేతాం వాడంత కతసెప్తన్నడు...చెప్పనీ ఏవేంజెప్తడో సూతిని అని ఊరుకున్న" అంటున్నాడు రాజిరెడ్డి. జెరసేపెవరు సప్పుడు జెయలే.

"అసలిసయం జెప్త నమ్మతవ్ గద.. పాపమనివూర్కుంటె అన్నాయమెక్వైతదట .. బావా మన తాతల కాణ్నించి జెర...సిగ్గిడ్చిపెట్టి చెప్తన్న నన్కు....మాదిగిండ్లల్ల ఇదీపనిచేస్తున్నదని .." అంట రాజిరెడ్డి సాంతం జెప్పక ముందె నడిమీతల పెంటిగాడందుకుని.... "ఎవర్ పటేలా చెప్పింది నాల్క జీతెయ్య .." అంట ఇవ్‌తల్కొచ్చాడు గుంపులకెల్లి.

నోర్మూస్కోరా నేన్లే నడ్గెటందుక్కీడ...అసల్ మీ మాదిగోళ్ళు సొకకు వయినోండ్లా "అంటవి" చెప్పు బావా చెప్పు" అని రాజిరెడ్డి దిక్కు దిరిగిండు మల్లరెడ్డి.

".... ఆసంగతెల్సుకొని జెర రేటు దక్వయిందనుకో దానికి... ఇగ పీకు నాకు ఎర్కలేందేవున్నది. ఇయ్యాల రిపోరటియ్యందే నాకు నిద్రవట్టదు. అసల్ వొక్కణ్నన్న జేల్కు పంపంది సక్కగ్గారు ముండకొడ్కులు" అంటని ఆగిండు రాజిరెడ్డి. మల్లరెడ్డి ఇశార జేయంగనె జెరసేపు లోపల్కిపోయొచ్చిండ్రు ఇద్దరు.

"ఏంర పెంటిగా ఏం జెప్పు మనోళ్లు గదాని వూర్కుంటే గానాయేం లేదు గదా.. రిపోరటు పంపుతున్న తంతె సక్కగాయిత్రా" అని "కాయిదం రాయి పంతులూ" అంటన్నడు మల్లి రెడ్డి

"పటేలా గులాబోన్ని ఎన్ని పంచాయితు లొచ్చినా మానూరి సంగతి బైటి కెక్కలేదు. తమరేమి ఎంత వద్దెనన్నా నమ్మకపోతిరి. ఇంక మమ్మల్నె పోలిసోళ్ళతోని దన్నిస్త వంటరు."

ఇగో గామాటనకురో పెంటిగా కోపమొస్తది. ఏంది రా నువ్ జెప్పింది. అంట కోపాన్కొచ్చిండు మల్లరెడ్డి.

"గులాబోన్ని కోప్పడకు పటేలా" అంట కాళ్ళమీద పడి పది రూపాయల్నోటు కాళ్ళకాడ పెట్టిండు.

"శీ...శీ శీ....ఏంద నాకుపై సలిస్తవు ఏవన్న లంచ గొండోణ్ణనుకున్నావా ఖబడ్దార్ తప్పుజేశి లంచం బెడ్తావ్ నీయమ్మ"

"పటేలా ఇగేం జెప్పాలె నీ గులాబోన్ని ఎన్నడూ" అంటన్నడు పెంటిగాడు ఏడ్చుకుంట.

"నాకేం దెల్వదు. రాజిరెడ్డి కాల్లు పట్కొ అయినిడ్చి పెట్టవంటెసూతాని" అంట జెరమెత్త వడ్డట్టు జేశిండు మల్లరెడ్డి. పెంటిగాడు రాజిరెడ్డి కాళ్లు పట్కున్నడు. రాజిరెడ్డి కోప్పడి కోప్ప "శీ...శీ సిగ్గులేదు .. తప్పు దాస్కుందావన్కున్నావురా నీ యమ్మ...నీ" అంటడు.

పోనీ బావ మనోడేగదా, అని రాజిరెడ్డి. పెంటిగాడు మళ్ళ కాళ్ళు పట్కోని ఇంకో పదిరూపాయల నోటు రాజిరెడ్డి కాళ్ళకాడ పెట్టిండు. "ఇగపోనీ...బావ జెప్పిండుగనక మనోడని ఊర్కున్న" అంట నోటుదీస్కోని "శిచ్చేందిరా.... శిచ్చ లేని తీర్మాన వేంగాని అడిపోరికేం శిచ్చలేదు.—నీకియ్యాలె తండ్రివై తప్పుడు పనిజేయించినందుకు." అంటున్నడు రాజిరెడ్డి

"అరె కొరలోడా ఆ బండ ఇట్లదే అరె వొంగుర పెంటిగా" అంటన్నడు మల్లరెడ్డి. ఏడుస్త వొంగిండు పెంటిగాడు. ఈపుమీద రాయి పెట్టి పిచ్చి జెరసేపయినాక దీపిచ్చిండు.

"పోరో ఇగపో అందర్కి బుద్ధి జెప్పాలెగాని మనంజెప్పించుకుంటాంర ఇంత వాయిసొచ్చింది. పోరి బుద్ధిలేక ఈ పని జేస్తావె నిన్ను గన్నందుకు మీ అయ్యకు ఎంత ఆపతి వొచ్చెసూడు ఇట్లైతె నిన్ను మనువాడి టోడివడే" అంటన్నాడు మల్లరెడ్డి. సూరికిది 'ఇసం' మింగినట్లనిపిచ్చింది. అందరు మెల్లెగ వోయింరు. రాజిరెడ్డి దిక్కు జూశి నగిండు మల్లరెడ్డి. మల్ల కర్ణం రంగారావు దిక్కుజూశిండు "ఏం పంతులూ" అంట వొంగి పదిరూపాలోన్టుదీస్కోని జేవుల కిల్లి మూడ్రూపాలు దీశిచ్చిండు రంగారావు రాజిరెడ్డి దిక్కుజూశిండు. రాజిరెడ్డి నగుత తనో రెండ్రూపాలిచ్చిండు.

"పోత బావ" అంట లేశి "తీర్మానం బాగ జెప్తివి" అంటండు రాజిరెడ్డి. అందరు మల్లోసారి నగింరు."

అంతా చెప్పి 'మీరేవంటరు' అన్నాడు రాములు.